www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 3 జులై 2025
5
అన్నమయ్య

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

హైదరాబాదు నగరానికి చెందిన విశ్రాంత దూరదర్శన్ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు, విశ్రాంత విద్యుత్ ఎసిఇ కోడూరు పుల్లారెడ్డి బుధవారం తమ నివాస గృహాల్లో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, బి.హరిక్రిష్ణలకు 500 పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో రివర్స్ ఆఫ్ ఇండియా, పెన్సిగ్నిఫ్ట్స్, భారతీయ సంస్కృతి, శతజయంతి సాహితీమూర్తులు, విలక్షణ పివి, శక్తి కాంతారావు, ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం2, ఒద్దిరాజు సోదరులు జీవితం సాహిత్యం, నిత్యాన్వేషణం, ముద్రారాక్షసమ్ తెలుగు అనువాదం, జాంబవతీ పరిణయం తెలుగు అనువాదం, మోహన్‌దాస్ ఓ మహాత్మ, రయాల లక్ష్మీనరసింహాచార్యులవారి కృతుల పరిశీలన, మహాయోగి విలాసోపాఖ్యానం, శ్రీత్యాగరాజ పరమహంస, వెన్నెల గింజలు, గీటురాయిపై అక్షర దర్శనం, వివిధ, ప్రవాస సాహిత్యం, కొన్ని ఊసులు ఇంకొన్ని ఊహలు, స్వాతంత్ర్యానికి అమృతోత్సవ హారతి, మనుచరిత్రం పరిచయం లాంటి పలు విలువైన ఇంగ్లీషు, తెలుగు గ్రంథాలున్నాయన్నారు.

నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు విశేష కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాయచోటి ఆర్‌డిఒ, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపలి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని, సోషల్ ఇంజినీరింగ్ అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్తున్నారన్నారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యమై గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు చేయి చేయి కలిపి పనిచేస్తే తప్పకుండా స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధ్యమైతుందని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను వారికి అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా మెరుగైన సేవలు కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి 175 నియోజకవర్గాలకు సంబంధించి ఒక ప్రణాళికను ఏర్పాటు చేసారని నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారన్నారు. వైస్ చైర్మన్‌గా ఆర్‌డిఒ, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారన్నారు. నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఎంపిడిఒ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని మంత్రి తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకొని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి గత 40 సంవత్సరాలలో 20 బెడ్ల నుంచి 50 బెడ్లకు వస్తే ఈ ఏడాదిలోనే అదనంగా 100 బెడ్లను తీసుకురావడం జరిగిందని మంత్రి తెలిపారు. సిసియు యూనిట్లు రాష్ట్రంలో నలుగురికే కేటాయిస్తే మన నియోజకవర్గా నికి ఒకటి మంజూరు అయ్యిందని అన్నారు. దాదాపు రూ.24 కోట్లతో ఇ క్రోమాకేర్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. గువ్వల చెరువు టన్నెల్ కూడా రూ.950 కోట్లతో టెండర్లకు పిలుస్తున్నామని అన్నారు. కడప నుంచి పీలేరు వరకు ఫోర్ లైన్ రెండు ప్యాకేజీ రోడ్లు వస్తున్నాయని తెలిపారు. గండి రోడ్డు కూడా మరమ్మతులు చేస్తున్నామని, రింగురోడ్ కూడా ఫోర్ లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కార్యాలయంలో ఐదు మంది సచివాలయ సిబ్బంది చొప్పున ఆరు నియోజకవర్గాల్లో 30 మంది చొప్పున పనిచేయడానికి సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ ఇలా 10 ప్రధాన సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ప్రణాళిక రూపకల్పనకు నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. డేటా మేనేజ్మెంట్, డేటా అనాలసిస్‌లో సచివాలయ సిబ్బంది అత్యంత చురుకుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వా లక్ష్యాలు సాధించేందుకు తపనతో పని చేయాలన్నారు. ఇకనుండి నియోజకవర్గ యూనిట్లే కీలకం కానున్నాయన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని వాళ్ల ఉన్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బెదిరింపులతో పోరాటాలను ఆపలేరు

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బెదిరింపులతో ప్రజా ఉద్యమాలను అణిచి వేయలేరన్న వాస్తవాన్ని మున్సిపల్ అధికారులు గ్రహించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెలరోజులుగా రిలే దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పై రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే వారి సమస్యలు చర్చించి ఉమ్మడి అవగాహనతో సమ్మె పరిష్కరించాల్సిన అధికారులు, పాలకవర్గం అధికార పార్టీ నేతలు ఆ పని చేయకుండా బెదిరింపు దోరణిలతో సమ్మె విరమిం చేసే కుటిల ప్రయత్నం చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.10000లు ఇచ్చి ఇతర కార్మికులను రోజువారీ పని కోసం కుదుర్చు కోవాలనే కుటిల ప్రయత్నాల కంటే ఇంజినీరింగ్ కార్మికులకు రోజుకు రూ.800 చెల్లించినా సరిపోతుందని అన్నారు. అంతకంటే వారు కూడా ఎక్కువ కోరడం లేదు కదా అని వివరించారు. కేవలం పోరాటం చేస్తున్న కార్మికుల పట్ల కక్ష సాధింపులో భాగమే ఈ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే కార్మికులు కోరుతున్న న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, జీవో నెంబర్ 36 మేరక వేతనాలను అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు కూడా రావడం లేదని తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగ్ ఉన్న జిఒలను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. కొత్తగా తీసుకున్న కార్మికులను అవుట్ సోర్సింగ్ విధానంలోకి చేర్చాలని, ఆప్కాస్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని తెలిపారు. వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75వేలు, ఎక్స్ గ్రేషియో రూ.7లక్షలు, దహన సంస్కారాలకు రూ.20వేలు అడుగుతున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ప్రజలను కూడగట్టి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు నారాయణ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలని కోరుతున్న కార్మికుల సమస్యలు న్యాయ సమ్మత. మైనవని, పాలకవర్గం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామకృష్ణ, రాజన్న, శ్రీరాములు, కృష్ణప్ప, శంకరమ్మ, తులసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

విద్యుదాఘాతంతో స్తంభంపైనే కుప్పకూలిన కూలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యుత్ లైన్‌లో ఏర్పడిన అంతరాయానికి మరమత్తులు చేస్తున్న కూలీ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు..పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో అర్ధరాత్రి ఓ లారీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ తీగలకు వేలాడుతూ నిలబడింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ నరసింహయ్య ద్వారా పక్కనే మరో స్తంభం ఏర్పాటు చేశారు. విరిగిన పోయిన స్తంభం నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభం లోకి విద్యుత్ తీగలను మార్చేందుకు కాంట్రాక్టర్ వద్ద కూలీ కి వచ్చిన నిమ్మనపల్లి మండలం, తవళం గ్రామం, ఉంటావారిపల్లెకు చెందిన వి.వెంకటరమణను లైన్ ఇన్స్‌పెక్టర్ మస్తానయ్య, ఎనర్జీ అసిస్టెంట్ శ్రీనివాస్ ఎక్కమన్నారు. ఎల్‌సి తీసుకున్నారా సార్ అని కూలీ వెంకటరమణ అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరించి తీసుకున్నామని శ్రీనివాస్ చెప్పాడని అన్నారు. అధికారులు చెప్పడంతో కాంట్రాక్టర్ నరసింహయ్య స్తంభం ఎక్కమని పురమాయిం చారని చెప్పారు. చేసేది లేక స్తంభం ఎక్కి వైర్లను ముట్టుకోగానే అందులో విద్యుత్ సరఫరా ఉండడంతో విద్యుదాఘాతానికి లోనైనట్లు తెలిపారు. అప్పటికప్పుడు విద్యత్ సరఫరా నిలిపివేసి, కుప్పకూలి తీగలపై పడిన కూలి వెంకటరమణ ను కిందకు దించి ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభం పైన కుప్పకూలిన కూలీ

బాధితుడిని ఆదుకోవాలి : సిపిఎం

పట్టణంలోని స్థానిక పటేల్ రోడ్డు, పెట్రోల్ బంక్ ఎదురుగా, మనప్పురం గోల్డ్ షాప్ ముందు ఉన్న విద్యుత్ లైన్ మరమ్మతుల కోసం కూలికి వచ్చిన నిమ్మనపల్లి మండలం, తవలం గ్రామం ఉంటావారిపల్లికి చెందిన కూలీ వెంకటరమణ విద్యుత్ శాఖ వలన ఆసుపత్రి పాలైనాడు. ఆసుపత్రిలో వెంకటరమణ కుటుంబాన్ని సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు ఇష్టారీతిన ఎల్‌సిలు తీసుకోవడం, తీసుకున్న ఎల్‌సిలపై స్పష్టత లేకపోవడం కారణంగా వెంకటరమణ తీవ్ర గాయాలు అయ్యాయని అన్నారు. మదనపల్లె ట్రాన్స్‌కో డిఇ గంగాధరం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సచివాలయం గ్రేడ్-2 జెఎల్‌ఎంలకు కూడా ఎల్‌సిలు ఇచ్చేయమని ఆదేశాలు ఇవ్వడం అంటే ప్రజల మీద ఆయనకున్న అభిప్రాయం ఏమిటో అర్థం అవుతుందని అన్నారు. పట్టణంలో మరమ్మతుల కారణంగా ఎల్‌సి తీసుకున్న లైను ఒకటైతే మరో లైన్ మరమ్మతుల కోసం రోజువారీ కూలీలను ఎక్కించడం అంటే కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడడం తప్ప మరొకటి కాదన్నారు. సగం శరీరం కాలిపోయి ఆసుపత్రి పాలైన వెంకటరమణ కుటుంబాన్ని అధికారులు ఎవరూ కనీసం పరామర్శ కూడా చేయలేదంటే, ఎంత నిరంకుశంగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని మదనపల్లె విద్యుత్ అధికారుల వైఖరిపైన సమగ్ర దర్యాప్తు చేయడంతో పాటుగా మదనపల్లె డిఇ గంగాధరన్ ను తప్పించాలన్నారు. విద్యుత్ ప్రమాదంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైనింగ్ ఇన్స్‌పెక్టర్, లైన్ మాన్, సచివాలయ జెఎల్ఎం లను వెంటనే సస్పెండ్ చేయాలని, కూలీ వెంకటరమణ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, వైద్య ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ జానకిరామ్

సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి

-విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సాయి శుభ కల్యాణ మండపంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, ఉద్యోగులు, కార్మికులతో ముఖాముఖి నిర్వహించి సెక్షన్ల వారిగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై సమీక్ష చేపట్టారు. మండల అధికారులకు, ఆ సెక్షన్‌లో పనిచేసే సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. వినియోగదారుల అడిగిన పలు సమస్యలపై సమాధానాలను కూలంకశంగా తెలియజేశారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకానికి సంబంధించిన కాంట్రాక్టర్లతో కూడా సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ పథకం కింద సోలార్ ప్యాంట్ ఏర్పాటు చేసుకోవడం వలన కరెంటు బిల్లును ఆదా చేయడమే కాకుండా పర్యావరణానికి మేలు చేయవచ్చునన్నా రు. ఒకసారి పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్ అమర్చుకోవడం ద్వారా 25 సంవత్సరాల పాటు సున్నా కరెంటు బిల్లుతో సంతోషంగా జీవించవచ్చునన్నారు. ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు.ఈ పథకానికి బ్యాంకు వారు ఏడు శాతం వడ్డీతో 90 శాతం రుణం ఇస్తారని ,సోలార్ ప్లాంట్ అమర్చే వారికి వన్ కిలో వాట్స్ రూ.30 వేలు, 2 కిలో వాట్స్ కు రూ.60 వేలు, 3 కిలో వాట్స్‌కు రూ.78 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ ప్లాంట్ అమర్చుకునే బిసి వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20 వేలు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఇ ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఇఇ పి.యుగందర్, ఈశ్వర్ రెడ్డి, డిఇఇ చాంద్‌బాషా, విజయ్‌కుమార్‌రెడ్డి, నాగమునిస్వామి, అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేడు ప్రయివేట్ విద్యా సంస్థల బంద్ : అపుస్మా

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ పాఠశాలలో 25 శాతం పేద, బడుగు, బలహీన వర్గాల, మైనార్టీ విద్యార్థులను చేర్చుకోవాలని ఉందని, దీనిని అమలు చేయడంలో లోపాలు ఉన్నాయని, ఇందుకు నిరసనగా ఈ నెల మూడవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు విద్యా సంస్థలు బంద్ పాటిస్తున్నట్లు అపుస్మా రాష్ట్ర చైర్మన్ ఎం.వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్ట ప్రకారం 12 (1ఎ), 12(1బి), 12(1సి) కింద మొదట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, అక్కడ సీట్లు సరిపోకపోతే ఎయిడెడ్ పాఠశాలలో చేర్పించాలని, అక్కడ సీట్లు సరిపోకపోతే చివరికి ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వీర్యం చేస్తూ ప్రయివేట్ పాఠశాలలను ప్రోత్సహించే విధంగా విద్యా హక్కు చట్టం అమలు చేస్తున్నట్లు ఉందన్నారు. పేద విద్యార్థులను చేర్పించుకోవడంలో తమకు అభ్యంతరం లేదని, ప్రభుత్వం నుంచి రావలసిన ఫీజురీయింబర్స్‌మెంట్ అందడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్య కోసం కోట్లల్లో ఖర్చు చేస్తుందని, అందులో సగం ప్రయివేట్ పాఠశాలలకు విద్యా హక్కు చట్టం కింద చదువుతున్న విద్యార్థుల కోసం ఇవ్వాలని తాము కోరుతున్నట్లు తెలిపారు. మూడు సంవత్సరాల్లో ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలో చదివించే స్థాయి ఉన్నవారు కూడా ఆర్తి ఏ కింద ఉచితంగా ఇక్కడ చదివిస్తున్నారని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో తాము పని చేస్తున్న ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ, డిఇఒ నుంచి బెదిరింపులు మాత్రం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియమనిబంధనలు ఎవరైనా పాటించాలని వేధించడం సరికాదని తెలిపారు. 12 (1సి) చదువుతున్న ఒక్కొక్కరికి రూ.40 వేలు ఇవ్వాలని, మూడు సంవత్సరాల చదువు చెప్పిన ఈ మొత్తాన్ని విడుదల చేయలేదని చెప్పారు. బందుకు సంబంధించిన నోటీసు పాఠశాల విద్య కమిషనర్, జిల్లాలలోని డిఇఒలకు ఇచ్చామని పేర్కొన్నారు. పార్టీలకు, సంఘాలకు అతీతంగా బంద్ పాటిస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు గంగయ్య, గౌరవ అధ్యక్షులు ఇలియాస్ రెడ్డి, రమణారెడ్డి, ఎం.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యనభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థులందరికీ తల్లికి వందనం మొత్తాన్ని వేయడం, పాఠశాల రెన్యువల్ 8 నుంచి 10 సంవత్సరాలకు పెంచడం పట్ల క ృతజ్ఞతలు తెలిపారు. చిన్న చిన్న కారణాలు చూపిస్తూ అధికారులు గుర్తింపును రద్దు చేస్తామని బెదిరించడం సరికాదని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- కెవికె సమన్వయకర్త వీరయ్య

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య అన్నారు. బుధవారం ఉటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వారు ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఒంటిమిట్ట మండల పరిధిలోని చింతరాజుపల్లి గ్రామంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరయ్య పాల్గొని మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చునని, ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. నాణ్యత పరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు ఎంతో కృషి చేయాలని సూచించారు. కె.వి.కె సస్యరక్షణ డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ రైతులకు ట్రైకోడెర్మా సూడోమోనాస్ వినియోగం, ప్రధాన పంటలలో కాషాయల ద్వార పురుగు, తెగుళ్ళ యాజమాన్యం, జిగురు అట్టలు లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు, పక్షి స్థావరాలు, కంచె పంటలు, ఎర పంటలు, జీవనీయంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణ గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి అరుణ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను వారే నిర్ణయించి అమలు చేస్తే బాగుంటుందని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస మాట్లాడుతూ అరటిలో రకాలు, మొక్కల ఎంపిక, గెల యాజమాన్యం, సహజ పద్ధతులలో పోషక యాజమాన్యం, పురుగు, తెగుళ్ల యాజమాన్యం గురించి, పసుపులో విత్తిన తరువాత నుండి కోత దాకా యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన కడప, నెల్లూరు మ్యాచ్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 232 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 303 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 144 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 114.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 419 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ అదుతేంగా బ్యాటింగ్ లో రాణించి 103 పరుగులు చేశాడు. సయ్యద్ షాహుల్ హుస్సేన్ 80 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఆర్దిత్ రెడ్డి 4, చరణ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 13.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆధిక్యత సాధించింది.

బిఇడి పరీక్షలు ప్రారంభం

- తనిఖీ చేసిన రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బిఇడి కళాశాలల రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. 4,551 మంది విద్యార్థులు పరీక్షలకు హజరైనట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం నుంచి ప్రతి కేంద్రానికి పరిశీలకులను పంపామని, ప్రత్యేకంగా హైపవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ పద్మ

సమావేశానికి హాజరైన ఎంసి చైర్మన్, కమిటీ సభ్యులు

అజెండాను ఆచరణలో పెట్టి అమలు చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు

అజెండా తీర్మానాలను ఒక్కొక్కటిగా ఆచరణలో పెట్టి అమలు చేద్దామని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురంరామమూర్తి తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో చైర్మన్ అధ్యక్షతన కార్యదర్శి హరినాథ్ ఉపాధ్యక్షులు డైరెక్టర్లతో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీకి మంజూరైన రైతుబజార్ నిర్మాణం పనుల కోసం నిధులు మంజూరు చేయించుకుని త్వరగా పనులు చేపడుదామని అన్నారు. 2025 మే నెల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయ, వ్యయాలను పరిశీలించి తగిన అవసరాల కోసం ఆమోదించు కోవడం జరుగుతుందని తెలిపారు. స్థానిక తిరుపతి రోడ్డులో గూడరేవుపల్లి పంచాయతీలోని సర్వే నంబర్:760/6లో ఉన్న రెండెకరాల స్థలంలో శీతల గెడ్డంగిని నిర్మించు కోవలసిన అవసరం ఉందని చెప్పారు. కెవిపల్లి మండల రైతులకు సౌకర్యంగా సబ్ మార్కెట్ యార్డ్ నిర్మించుటకు సర్వేనెంబర్ 580లో 6.26 ఎకరాల స్థలముందని, అందులో మౌలిక వసతుల ఏర్పాటు కోసం అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేద్దామని అన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఎర్రగుంట్లపల్లె పంచాయతీ, నెట్టిబండ సమీపంలో రైతుల సౌకర్యార్థం పశు సంవర్ధక శాఖ వారి ఆధీనంలో సర్వేనెంబర్ 565లో ఉన్న పది ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా దాన్ని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి అప్పగించేలా పశుసంవర్ధక శాఖను కోరుదామని అన్నారు. పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం భవనం మరమ్మతులు తగిన అంచనాల ప్రణాళికను సిద్ధం చేసి పంపాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనలన్నిటిని ఆచరణలోకి తీసుకొచ్చి వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడుపుతూ, రైతులకు అండగా నిలబడుదామన్నారు. ఎఎంసి మొదటి సమావేశం జరిగిన సందర్భంగా డైరెక్టర్లందరినీ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి హరినాథ్, డైరెక్టర్లు ఆదర్శ రైతు అమర్నాథ్ రెడ్డి, గోళ్ళ కిషోర్ నాయుడు, కలప రవి, పి.రహంతుల్లా, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, సుబ్బయ్య, మల్లెల సాధన, వనిత, జె.అనురాధ, కృష్ణమూర్తి, ఎం. రజనీశ్రీ, శివమ్మ పాల్గొన్నారు.

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురండి : జడ్జి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం జడ్జి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, టాయిలెట్లను వసతి గదులను, వంటశాలను, పరిసరాలను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ పాల్గొన్నారు.

కౌన్సిలర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- పోలీసుల తీరుకు నిరసనగా ఎంఆర్‌పిఎస్ ధర్నా

పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పిఎస్ శ్రేణులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని రెండవ పట్టణ పోలీసుల ఎదుట ఎంపి ఆర్‌పిఎస్ శ్రేణులు బుధవారం బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బాధిత వైసిపికి దళిత కౌన్సిలర్ ప్రసాద్ మాట్లా డుతూ జూన్ 30న సాయంత్రం ఆర్కే పార్కింగ్ స్థలం నుంచి తన కారును వెనక్కి తీస్తుండగా రామారావుకాలనీకి చెందిన సుధాకర్ అదే సమయంలో పార్కింగ్‌లోకి పెట్టేందుకు తన కారును తేవడంతో రెండు కార్లు ఇరుక్కుపోయా యన్నారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో ఆగ్రహించిన సుధాకర్ దుర్భాషలాడి బండరాయితో తనపై దాడికి యత్నించాడన్నారు. ఈ లోపు స్థానికంగా ఉన్న గొల్లపల్లికి చెందిన యువకులు అక్కడికి చేరుకుని సుధాకర్‌తో గొడవ పడ్డారని పేర్కొన్నారు. తరువాత ఎవరి దారినవారు వెళ్లిపోయామని పేర్కొన్నారు. సుధాకర్‌కు బంధువు అయ్యే టిడిపి కార్యకర్త నాగమని కలుగజేసుకుని, సమసిపోయిన సమస్యను పెద్దదిగా చిత్రీకరిస్తూ, పలుకుబడి ఉప యోగించి అకారణంగా తనపై కేసు నమోదు చేయించారని చెప్పారు. తాను ఇచ్చిన ఫిర్యాదు పై మాత్రం పోలీసులు కేసు నమోదు చేయకుండా ఏకపక్షంగా వ్యవహరించాని అన్నారు. ప్రజా ప్రతినిధిగా ఉన్న తనకే ఇలా జరిగితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని పోలీసులను నిలదీశారు. దళితులపై వివక్ష చూపుతూ అణిచి వేయాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. తనను దుర్భాషలాడి, బండరాయితో దాడి యత్నించిన సుధాకర్ పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆ ర్‌పిఎస్ పాటు, స్థానిక గొల్లపల్లి వాసులతో కలిసి స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. వెంటనే సుధాకర్ పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నినదించారు. ఈలోపు సిఐ రామచంద్ర అక్కడికి చేరుకొని సాయంత్రం లోపు మీరిచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. దళితులను అణచివేసేం దుకు కుట్ర జరుగుతోందని దానికి రాజకీ య రంగు పులు ముతు న్నారని ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్ర అన్నారు. తమకు న్యాయం జరగని పక్షంలో అన్ని పార్టీలను, ప్రజాసంఘాలను ఏకం చేసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు హరి, రెడ్డిశేఖర్, బాబు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని తూముకుంటలో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు కావలసిన 200 ఎకరాల స్థలాన్ని పరిశీలించడానికి ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు బుధవారం తూముకుంట, పాపిరెడ్డిగారిపల్లి వద్ద ఉన్న కొండలను, గుట్ట లను పరిశీలించారు. ఇప్పటికే తూముకుంట గ్రామంలో ఎక్కువగా సోలార్‌కు భూమి కేటాయించారు. మరోక ప్రయివేట్ కంపెనీకి ఇదివరకు గ్యాస్‌ప్లాంట్ ఏర్పాటు కూడా 200ఎకరాల భూసేకరణ కొరకు ప్రయత్నం చేస్తున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.భాగ్యలత ఆర్‌ఐ, మండల సర్వేయర్, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె ఎంపిడిఒగా రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌బాబు

నిమ్మనపల్లె నూతన ఎంపిడిఒగా రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పని చేస్తున్న పరమేశ్వర్ రెడ్డి గుర్రంకొండ మండలానికి బదిలీ కాగా, ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న రమేష్ బాబుకు ఉన్నతాధికారులు ఎంపిడిఒగా బాధ్యతలను అప్పగించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, టిడిపి నాయకులు ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌బాబుకు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా పారదర్శకంగా చర్యలు చేపడతామని తెలిపారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా, క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, చేపట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో, సహకారంతో కృషి చేస్తానన్నారు.

సిఎంను కలిసిన ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-రాయచోటి

సిఎం చంద్రబాబుతో ప్రసాద్‌బాబు

విజయవాడలో ముఖ్యమంత్రి సిఎం చంద్రబాబును రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించినట్లు ప్రసాద్‌బాబు పేర్కొన్నారు.

టౌన్ సర్వీస్ బస్సులు నడపాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా కేంద్రమైన పట్టణంలో ఆర్‌టిసి టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యద్దులరెడ్డి విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన జిల్లా కేంద్రంలో కడప రోడ్డులో జిల్లా కలెక్టర్, యం పి కార్యాలయాలు ఒకవైపు గాలివీడు రోడ్డులో కోర్టు సముదాయం మరోకవైపు, రాజంపేట రోడ్డులో కొన్ని కార్యాలయాలు,పీలేరు రోడ్డులో ఆర్‌టిఒకార్యాలయం, ఇతర జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు దూరదూరంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళాలంటే ఆటో చార్జీలు ప్రజలకు ఆర్థిక భారంగా ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్‌టిసి బస్టాండ్ నుంచి రాయచోటి రింగ్ రోడ్డుపైన ఫ్లై ఓవర్, యాంటీ ఫ్లై ఓవర్, పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఆర్‌టిసి టౌన్ సర్వీస్ బస్సులు నడిపి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటిడిఎ మల్లికార్జునరెడ్డి

మెనూ తప్పక పాటించాలి : ఐటిడిఎ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెలోని ఎస్‌టి బాలుర గురుకుల పాఠశాలను ఐటిడిఎ నెల్లూరు ప్రాజెక్టు అధికారి మల్లికార్జునరెడ్డి, డిటిడబ్ల్యూఒ తేజశ్విని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, విద్య, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు తగ్గడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో రెగ్యులర్ ప్రిన్సిపల్‌తో పాటు, ఉపాధ్యాయులను నియమిస్తా మన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రంగనాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు వంద శాతం రాయితీ

ప్రజాశక్తి - లింగాల : డ్రిప్ ఇరిగేషన్ పథకం ద్వారా అయిదు ఎకరాల్లోపు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి రైతులకు వంద శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ పీడీ వేంకటేశ్వరరెడ్డి సూచించారు. మండల పరిధిలోని గుణకణపల్లెలో పర్యటించారు. రైతుల పొలంలో డ్రిప్ మోటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఐఒ ఏసునాథరెడ్డి, జైన్ డీలర్ల వెంకట నారాయణ రెడ్డి పాల్గొన్నారు **సింహాద్రిపురం :** బిందు సేద్య పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపి పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కడప నాగయ్యపల్లె, దుద్దేకుంట, అంకాలమ్మ గూడూరు గ్రామాలలో జైన్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరికరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పది ఎకరాల భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్పు పరికరాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హతగల ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం డ్రిప్పు పరికరాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

బాబూ.. బనకచర్ల ఆలోచనను విరమించుకో

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె : కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఇప్పటికైనా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి సూచించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు ఆచరణ సాధ్యం కాదని, రాష్ట్రానికి గుది బండ అవుతుందని తొలినుంచి కాంగ్రెస్ చెపుతున్నట్లు తెలిపారు. తెలంగాణాకు కాళేశ్వరంలా ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం-బనకచర్ల గుది బండ అవుతుందని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే టిడిపి, వైసిపి, కూటమి ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యం వల్ల రాష్ట్రం అప్పుల్లో ఉందన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల రాష్ట్రం శాశ్వతంగా అప్పుల ఊబిలో కూరుకుపోతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత అంచనా రూ.81,900 కోట్లు అన్నారు. నిధులు లేక తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలిగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు దశాబ్దాలుగా పూర్తిగాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ఏడాది పాలన సుపరిపాలన అని కూటమి ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి పాలనది దుష్పరిపాలన అన్నారు. సుపరిపాలన అందించడం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి : సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ప్రజా సంక్షేమమే సిఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక అమర్నాథ్‌రెడ్డి కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు పథకాలను సంపూర్ణంగా అమలు చేయడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే నిరుద్యోగ యువత కొరకు డిఎస్‌సి నిర్వహించడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల, వితంతువులకు పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.5వేల వరకు పెం చారని అన్నారు. తల్లికి వందనం పేరుతో అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదును జమ చేశారని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయా ణ సౌకర్యం కల్పిస్తారని, మిగిలిన పథకాలు కూడా త్వరలో అమలు చేయ డానికి సిఎం కృషి చేస్తు న్నారని తెలిపారు. గ్రామంలో ఇంకా ఎలాంటి సమ స్యలు ఉన్న ఎప్పటికప్పుడు పరిష్క రించడానికి అధికారులు ఎప్పుడు అందు బాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో సహకార బ్యాంక్ చైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాలతి, వైస్ చైర్మన్ సనా వుల్లా, డైరెక్టర్లు శ్రీనివాస్ వర్మ, రాంబాబు, యువ నాయకుడు యోగేష్‌రెడ్డి, ఎర్రం రెడ్డి, అగస్తేశ్వర్, నాయకలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** రాష్ట్రంలో సుపరిపాలన అభివృద్ధిలో గ్రామాలలో తెలుగుదేశం కార్యకర్తలను నాయకులు కలుపుకొని గడపగడపకు తొలి అడుగులు వేస్తున్నట్లు రైల్వే కోడూరు తెలుగుదేశం ఇంచార్జ్ కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. చిన్న ఓరంపాడు సిఒ కమ్మపల్లి, దిగువపల్లి పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయన వెంట తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, ముక్కా వరలక్ష్మి ,సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవ రెడ్డి, బత్తినవేణుగోపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గూనిపాటి చెన్నరాయుడు, పోలినశివయ్యనాయుడు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, టిడిపి సీనియర్ నాయకులు వేమన సుబ్రహ్మణ్యం నాయుడు,ఈశ్వర్ నాయుడు పాల్గొన్నారు. **నందలూరు :** కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో సుపరిపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భువన బోయినలక్ష్మీ నరసయ్య ,నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబుసూర్యనారాయణ టంగుటూరు, మదన మోహనపురం గ్రామ పంచాయతీల సర్పంచులు షేక్ మైనుద్దీన్, చుక్క యానాది, ఎంపిటిసి పెంచలయ్య, ఐటీఃటీ సెల్ రాజంపేట నియోజవర్గ అధికార ప్రతినిధి కానకుర్తి వెంకటయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు షర్మిల ,గుజ్జల ఈశ్వరయ్య పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని దపేపల్లి, దిన్నేపాడు, అనంతపురం గ్రామాలలో మన మంచి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి , మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు మండల ఇంచార్జ్ యనమల మధునమోహన్ టిడిపి కార్యకర్తలతో ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర్, చలపతి, రమణయ్య, బోనాల దన, రవిశంకర్ రాయల్, ఓబులేసు, హేమంత్, కిట్టు, ఉమహేశ్వర్ రెడ్డి, ఓబులేసు, బోనాల ధన, చిన్న రెడ్డయ్య, వేమయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వితం తువులు, వృద్ధులు, వికలాంగులకు కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని అందజేస్తూ భరోసా ఇస్తున్నట్లు క్లస్టర్ కన్వీనర్ డాక్టర్ మల్లెల రెడ్డిబాషా, పీలేరు పట్టణ అధ్యక్షులు దళవాయి సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. సిఎం చంద్రబాబు మేరకు కూటమి కార్యకర్తలతో కలిసి చెన్నారెడ్డి కాలనీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు ఇంటింటికి తిరిగి వివరిస్తూ, వాళ్ల సమస్యలను అడిగి తెలుసుకునే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి కాలనీ హరి, కాలేషా, పీలేరు మండల మైనార్టీ అధ్యక్షులు అత్తర్ చాంద్‌బాషా, ప్రముఖ మైనారిటీ నాయకులు షౌకత్ పాల్గొన్నారు. **చిట్వేలి:** మండల పరిధిలోని రాజు కుంట గ్రామంలో మన మంచి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టిడిపి అట్టహాసంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుత్తి నరసింహ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కారూపానందరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భవిష్యత్తులో ప్రజా సంక్షేమ పాలన ఎలా ఉంటుందో వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు ప్రభుత్వం నుంచి అందుతున్న సంతృప్తి వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, సాయివికాస్‌రెడ్డి, అనిత దీప్తి, జై ప్రకాష్, ఏదోటి రాజశేఖర్, నాన బాల నాగార్జున, ఉప్పలపాటి శివప్రసాద్‌రాజు, తమ్మిశెట్టి శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, నరసింహనాయుడు ,వెంకటేష్ నాయుడు, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలి : ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న రూపానందరెడ్డి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

బి.కొత్తకోట : మాట్లాడుతున్న సిఐ గంగానాథ్‌బాబు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థులు మాదకద్రవ్యాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సిఐ జీవన్ గంగానాథ్‌బాబు సూచించారు. బుధవారం సుంకు జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, మైనర్ డ్రైవింగ్, శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని, వాటికి బానిసైతే భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందన్నారు.అదేవిధంగా ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమైపోయాయని,వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒటిపిల పేరుతో ఖాతాలలో నగదు మాయం చేస్తారన్నారు.మత్తు పదార్థాలు,ర్యాగింగ్ వంటివి మీ పరిసరాలలో ఎక్కడైనా జరిగితే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుంకు కాలేజ్ ప్రిన్సిపల్ మంజునాథ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** ర్యాగింగ్, సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఉమా మహేశ్వర్ రెడ్డి సూచించారు. తంబళ్లపల్లె జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత నిబంధనలు, పోక్సో చట్టం, నూతన ట్రాఫిక్ చట్టాలు, ర్యాగింగ్తో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదివి దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాల్లో మెరిసిన 'శ్రీసాయి' విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్) తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే యూనివర్సిటీ విడుదల చేసిన తృతీయ సంవత్సర ఫలితాలలో కూడా కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ పరిధిలో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టారని తెలియజేస్తూ విద్యార్థులను, కళాశాల అధ్యాపకులను అభినందించారు.తృతీయ సంవత్సర రెండవ సెమిస్టర్ ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో సయ్యద్ సనా సాజియా 94.94 శాతంతో మొదటి ర్యాంకు, కలకడ సఫియా 89.89 శాతంతో రెండవ ర్యాంకు, పఠాన్ ముస్కాన్ 89.46 శాతంతో మూడవ ర్యాంకు , ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుంచి షేక్ మూలింటి సబీహ 89.5 శాతంతో మొదటి ర్యాంకు, ఎస్ హుమేర 87 శాతంతో రెండవ ర్యాంకు, ఎం. వెంకట పవిత్ర 86శాతంతో మూడవ ర్యాంకు సాధించారని తెలిపారు. కళాశాలలో అకాడమిక్ అంశాలతో పాటు, కమ్యూని కేషన్ స్కిల్స్, అర్థమెటిక్ రీజనింగ్ విభాగాలలో ప్రత్యేక శిక్షణ కల్పించి ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వెంకటరమణ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కరుణాకర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

అటవీ సంపద పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ముద్దనూరు

అటవీ సంపద పరిరక్షణకు కృషి చేస్తానని ముద్దనూరు అటవీశాఖ ఇన్‌ఛార్జి రేంజర్ ఆఫీసర్ హేమాంజలి తెలిపారు. ఇక్కడ ఉన్న ఎఫ్ఆర్ఒ ఉద్యోగ విరమణ చేయ డంతో ఆమె ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఒగా బుధవారం భాద్యతలు చేపట్టారు. ఉన్నతాధికారులు ప్రొద్దు టూరు అటవీశాఖ రేంజర్ ఆఫీసర్ హేమాం జలికి ఇన్‌ఛార్జి భాద్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్ర చం దనం అక్రమ రవాణా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అడవి జంతువుల సంరక్షణ, మొక్కల పెంపకానికి పాటుపడతానని పేర్కొన్నారు.

'గండి'లో కొన్ని టెండర్లకు మాత్రమే ఆమోదం : ఇఒ

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో ఈ ఏడాది జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు బుధవారం దేవస్థాన కార్యనిర్వహణ అధికారి జె వెంకటసుబ్బయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్లు నిర్వహించారు. స్వాగత తోరణాలు ఏర్పాటుకు అడుగు రూ.270 చొప్పున మణికంఠ టెండర్ దక్కించుకున్నారు. శ్రావణమాస ఉత్సవాల్లో ఐదు శ్రావణ శనివారాల్లో ఫోటోలు, వీడియోలు రికార్డ్ చేసి ఇచ్చేందుకు రూ.31,300 దేవరగట్టుపల్లె సిద్ధయ్య దక్కించుకున్నారు. శ్రావణమాస శనివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించడానికి భజంత్రీలు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున శ్రీనివాసులు టెండర్ దక్కించుకున్నారు. పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్లు, బారీకేడ్ల టెండర్లను రద్దే చేశామని ఇఒ వెంకటసుబ్బయ్య తెలిపారు. మళ్లీ టెండర్లు నిర్వహించేటప్పుడు వేంపల్లి, పులివెందల, ప్రొద్దుటూరు, కడప సప్లయిర్స్‌కు తెలియజేసి సీల్డ్ టెండర్లు నిర్వహిస్తామన్నారు. అనంతరం దేవస్థాన పాలకమండలి సభ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చిం చారు. శ్రావణ మాసంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. కార్యక్రమంలో గండి దేవస్థాన మాజీ చైర్మన్లు వెంకట స్వామి, భాస్కర్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'వరద'కు ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి చేసిన ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతమైందని, అభిమానులు, నాయకులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కుమారుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి తెలిపారు. కనీసం ఒక పది రోజులు ఎవ్వరూ రావద్దని సూచిస్తున్నా మన్నారు. జనంతో వెంటనే కలవడం వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చే అవ కాశం ఉంటుందన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలంటే విశ్రాంతి అవసరమన్నారు.

కూటమి ప్రభుత్వానిది కక్షపూరిత రాజకీయం

వేంపల్లె : కూటమి ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయం చేయడం సరైంది కాదని వైసిపి యవజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వైసిపి నాయకుడైన శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చి వేశారన్నారు. ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటుంటే ఇప్పుడు చెరువు భూమి అంటూ కూల్చివేయడం దారుణమన్నారు.

మంచి చేస్తే గుర్తుండిపోతారు

ప్రజాశక్తి - ఖాజీపేట ప్రజలకు మంచి చేస్తే ఏ ఉద్యోగి అయినా చిరకాలం గుర్తుం డిపోతారని పలువురు పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వ సాధారణమని ఎపిఐఐసి రాష్ట్ర మజీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, సర్పంచ్ రాణమ్మ పేర్కొన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలోని సచివాలయ సిబ్బంది బదిలీపై వెళుతున్న సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను అందిస్తున్న ఎంఇఒలు

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్ రాజు, నాగ తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటవ తరగతి విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పలక మీద అక్షరాలు వృద్ధించి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలతో ఒక నూతన ఉత్సాహాన్ని నింపడం జరుగుతుందని అమ్మ మొదటి దైవము కావున తల్లితో అక్షరాలు దిద్దించడం శుభపరిణామమని అన్నారు. దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మార్పు చెందడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను అందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ నేటి అక్షరాభ్యాస కార్యక్రమానికి దాత అయినటువంటి బోధనపు సిద్దు పిల్లలకు పలకలు, ఇతర విద్యాసామగ్రి అందించడం జరిగిందని పేర్కొన్నారు. సిద్దు దంపతులు పాఠశాలకు సేవలు అందించడంలో ముందు వరుసలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రియల్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజేంద్రప్రసాద్ (ఫైల్ ఫొటో)

అప్పులు బాధ తాళలేక రియల్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అమ్మినేనివీధికి చెందిన బొజ్జ రాజేంద్రప్రసాద్(50) రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించేవాడు. స్థానిక కృష్ణా నగర్‌లో ఉన్న కార్యాలయంలో వ్యాపార లావాదేవీలు జరిపేవారు. వ్యాపార నిమిత్తం పలువురి వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. వ్యాపారాలు ముందుకు సాగక పోవడంతో నష్టాల్లో కూరుకుపోయాడు. అధిక వడ్డీలు కట్టలేక తీవ్ర మనస్తాపానికి గురి అయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేదని గ్రహించి మధ్యాహ్నం భోజనానికి వెళ్లే సమయంలో ఒంటరిగా ఉండడంతో ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరై తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. కార్యాలయం తలుపులు మూసుకుని అధిక వడ్డీలు ఎక్కువయ్యాయని, వాటిని కట్టలేని పరిస్థితుల్లో ఉన్నానని, చావు తప్ప వేరే మార్గం లేదని, భార్య, బిడ్డ క్షమించమని కోరతూ సెల్ఫీ వీడియో తీసుకుని కార్యాలయంలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమయంలో కార్యాలయానికి వెళ్ళిన స్థానికులు లోపల లాక్ వేసి ఉండడంతో కాసేపు తలుపు తట్టారు. స్పందన లేకపోవడంతో కిటికీలోంచి చూడగా రాజేంద్రప్రసాద్ ఉరికి వేలాడుతూ కనపడ్డాడు. గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చారు. రాజేంద్రప్రసాద్ భార్య లత స్నేహితురాలు, మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి అక్కడికి చేరుకొని చూడగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నారు.. దీంతో ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య లతతో పాటు ఇంటర్ చదువుతున్న కుమార్తె రిషిత ప్రసాద్ ఉన్నారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో వితంతు మహిళ..

లత (ఫైల్ ఫొటో)

రామాపురం : మండలంలోని కుమ్మరిపల్లి పంచాయతీ మన్నేరువాండ్లపల్లె చెందిన మన్నేరు లత(38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కుమ్మంపల్లి పంచాయతీ, మన్నేరు వాళ్లపల్లెకు చెందిన వితంతువు లతను అదే గ్రామానికి చెందిన ఏనుగుల శివ అనే వ్యక్తి గతకొంత కాలంగా తనకు లొంగిపోయి ప్రేమించాలని, లేకపోతే తాను చనిపో తానని వేధించేవాడని తెలిపారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అస్మార్క స్థితిలోకి వెళ్లడంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అన్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ల సలహా మేరకు వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

మామిడితోటలో వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని వంగిమళ్ళ పంచాయతీ నల్లపర్వతరెడ్డిగారిపల్లి రామయ్య కుంట దగ్గర ఉండే మామిడి తోటలో పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి (70) అనే వృద్ధుడు అనుమానాస్పద మృతి చెందారు. స్థానిక సమాచారం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం ఊరు బయట రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుబ్బారెడ్డి తన మామిడి తోటలోకి వెళ్లారని, ఎంతసేపు తిరిగి ఇంటికి రాకపోవడంతో సాయంకాలం కుటుంబ సభ్యులు బంధువులు తోట దగ్గరికి వెళ్లి చూడగా మోటార్ స్టార్టర్ దగ్గర రక్తం మడుగులో మృతి చెంది ఉన్నాడని తెలిపారు. వెంటనే మృత దేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వీరబల్లి పోలీస్ స్టేషన్ కు తెలిపారు. సిఐ వరప్రసాద్, ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతి దేహాన్ని పరిశీలించారు.పలు అనుమానాలు వ్యక్తం కావడంతో సుబ్బారెడ్డికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులను విచారించారు. విద్యుత్ తీగలు తగులు కొని మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన సుబ్బారెడ్డికి తలకు కాళ్లకు గాయాలు ఉండడంతో స్థానికులు కొందరు సుబ్బారెడ్డి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో రూరల్ సిఐ వరప్రసాద్, ఎస్ఐ నరసింహారెడ్డి సిబ్బందితో మామిడి తోటలోకి వెళ్లి పరిశీలించారు. సుబ్బారెడ్డికి సంబంధించి బట్టలు చెప్పులు రక్తపు మరకలు ను వారు పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటికి తరలించడం జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బుద్ధునికొండలో విగ్రహాల ధ్వంసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ధ్వంసమైన బుద్దుడి విగ్రహం

మండల పరిధిలో అంకిశెట్టిపల్లి వద్దనున్న బుద్ధుని కొండపై దుండగులు రెచ్చిపోయారు. బుధవారం తథాగతుడు గౌతమ బుద్ధుని విగ్రహం ధ్వంసం చేసి, దిమ్మెపై నుండి విగ్రహాన్ని క్రిందకు తోసేశారు. బుధ్దుడి తలను నరికి, కాళ్ళ దగ్గర ఉంచారు. గతంలో కూడా దుండగులు ఇక్కడ మూడు విగ్రహాలు, సిసి కెమోరాలు ధ్వంసం చేశారని నాగలోకం బుద్ధ విహార్ ట్రస్టీ పిటియం శివప్రసాద్ తెలిపారు. గతంలో విగ్రహాల ధ్వంసంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోక పోవడంతోనే దుండగులు బరితెగించి మళ్ళీ నాలుగో విగ్రహం ధ్వంసం చేశారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి బుద్ధుని విగ్రహాల ధ్వంసం పై చర్యలు తీసుకొని దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.